## శివనాయుడు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



శివనాయుడు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, అక్టోబర్ 3 : పట్టణంలో 10వ వార్డుకు చెందిన శివనాయుడు సోమవారం తెల్లవారుజామున గణేశుడి నిమజ్జనం సందర్భంగా అంకిరావుపల్లి సమీపంలో కేఎల్ఐ కెనాల్‌లో గల్లంతై మంగళవారం శవం ఆచూకీ లభ్యమైంది. ఘటనా స్థలం నుంచి బంధుమిత్రులు పట్టణంలో డీజేల మోతలతో శవయాత్రగా శివనాయుడు భౌతికకాయానికి ఇంటికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శివనాయుడు ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనతికాలంలోనే ఎంతో నైపుణ్యంతో డీజే ఆపరేటర్‌గా పేరు తెచ్చుకున్న శివనాయుడు మృతి తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణయ్య,10వార్డు బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎల్ఐసీ పాషా, బీఆర్ఎస్ నాయకులు హుస్సేన్, హరికృష్ణ, బాబా తదితరులు ఉన్నారు.

## పెంట్లవెల్లి వాసికి మెడికల్ పీజీలో ఉచిత సీటు

పెంట్లవెల్లి, అక్టోబర్ 3 : మండలకేంద్రమైన పెంట్లవెల్లి మాజీ సర్పంచ్ కోట్ల సురేందర్ చిన్న కుమారుడు డాక్టర్ లిఖిత్‌కు మెడికల్ పీజీలో (అనిస్తీషియా) చదువుట కోసం ముంబైలో ఉచితంగా సీటు లభించింది. ముంబైలోని లోక్‌మాన్య తిలక్ ప్రభుత్వం మెడికల్ కాలేజీలో చదువుటకు అవకాశం రావడంతో పెంట్లవెల్లిలో బంధువులు, మిత్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ లిఖిత్‌ను అభినంధించారు. తండ్రికి తగ్గ తనయుడని గ్రామస్తులు కొనియాడారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 3 : పెద్దకొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:30గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు. అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## నేడు మైసమ్మ ఆలయం ప్రారంభం

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 3:మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ ఆల యం బుధవారం వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు. కార్యక్రమానికి మం డలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరైవిజయవంతం చేయాలని కోరారు.

## ఫార్మేషన్ రోడ్డుకు భూమిపూజ



ఫార్మేషన్ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ దశరథం నాయక్

కొల్లాపూర్, అక్టోబర్ 3 : మండలంలోని ముక్కిడిగుండంలో పోచమ్మగుడి నుంచి తెట్టెకుంటబండ వరకు కిలోమీటరు పొడవునా నిర్మించతలపెట్టిన ఫార్మేషన్ రోడ్డుకు సర్పంచ్ సభావట్ దశరథంనాయక్ మంగళవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహాయ సహకారాలతో మంజూరైన నిధులతో దెబ్బతిన్న తెట్టెకుంటబండ రహదారిని మెరుగుపర్చేందుకు గానూ ఫార్మేషన్ రోడ్డు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముచ్చెర్ల వేణుగోపాల్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు బాలునాయక్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

పెంట్లవెల్లి, అక్టోబర్ 3 : ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని మంగళవారం ఆ సంఘ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా మంజునాథ్, కార్యదర్శిగా తరుణ్‌లతోపాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగిరి తరుణ్, కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ తన వంతుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, బైరవ,శివకుమార్ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి..

● ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



బాచారంలో బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 3 : కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేరొన్నారు. మండలంలోని బాచారం ఉపసర్పంచ్ మశన్నతోపాటు గ్రామ నాయకులు ఈశ్వర్, రమేశ్, చంద్రశేఖర్, చంద్రయ్య, శివ, రాముడులతోపాటు 150 మంది నాయకులు, యువకులు, అదేవిధంగా మారెడుమాన్‌దిన్నె ఉపసర్పంచ్ శ్రీధర్‌రావుతోపాటు 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అభిలాష్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాచారం నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయించానని, గ్రామంలో ఉన్న గ్రామ కంఠం సమస్యలను పరిష్కరించి ప్రజలందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తానన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులను రూ.15 లక్షలు గ్రామాభివృద్ధికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో బాచారం హైలెవల్ కెనాల్ మంజూరు చేయలేక గాలికి వదిలిన ఒక నాయకుడు అధికార దాహంకోసం మరో పార్టీలో చేరి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని ఎత్తులు వేసినా కొల్లాపూర్ కోటపై గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, తెలంగాణ రావడంతో అభివృద్ధి, సంక్షేమంలో అద్భుతమైన ప్రగతి సాధిస్తుందని, సీఎం కేసీఆర్ గొప్పగా పాలిస్తున్నాడని, కేసీఆర్ దార్శనిక పాలనతో ప్రతి పల్లెకు అభివృద్ధి ఫలాలు, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కొల్లాపూర్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం, గౌరవం ఉంటుందన్నారు. ఈనెల 4న యాపట్లలో రూ.33 కోట్ల వ్యయంతో మంజూరైన బాచారం హైలెవల్ కెనాల్ పైలాన్‌కు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారని చెప్పారు. ఈ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయించి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. బాచారం గ్రామంలో అన్ని రంగాల్లో వసతులు కల్పించి రూ.50 లక్షల వ్యయంతో అధునాతన పాఠశాల నిర్మాణం చేయిస్తానన్నారు. గ్రామంలో హనుమాన్ ఆలయం నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో 30 ఏండ్లలో చేయలేని అభివృద్ధిని ఐదేండ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేయించానన్నారు. అనంతరం గ్రామ సమీపంలోని తుక్కకుంట వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, ఘట్టయ్య, ఎంపీటీసీ వెంకటస్వామి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ నర్సింహ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రాజగౌడ్, మండల బీఆర్ఎస్ నాయకులు రవినాయక్, మోహన్‌రెడ్డి, ధర్మారెడ్డి, రాజశేఖర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## మిషన్ భగీరథ కనెక్షన్లను పరిశీలించిన చైర్‌పర్సన్



నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీచారి

కొల్లాపూర్,అక్టోబర్ 3 : పట్టణంలో 18,4వ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రఘుప్రోలు విజయలక్ష్మీచారి మంగళవారం పర్యటించారు. మిషన్‌భగీరథ నీటి కనెక్షన్లను ఆమె పర్యవేక్షించి నీటి విడుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వార్డుల్లో పర్యటిస్తూ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి కనెక్షన్ పైపుల నుంచి నీరు వృథా పోకుండా మూతలను పంపిణీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అయితే నీటిని పట్టుకున్న తరువాత పైపులకు మూతలు పెట్టాలని ఆమె ప్రజలకు సూచించారు. అనంతరం 4వ వార్డులో నూతనంగా నిర్మించిన పార్కును, అందులో ఏర్పాటు చేసిన పూలమొక్కలు, చిన్నారులు ఆటలాడుకునే ఏర్పాటు చేస్తున్న పరికరాలను పరిశీలించారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పట్టణ అభివృద్ధి కోసం వారి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని, ఎమ్మెల్యే చొరవతో మున్సిపాలిటీకి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు మంజూరయ్యాయని, పట్టణంలో కొత్తగా సీసీరోడ్లు, సైడ్ డ్రైన్‌లు, పార్కులు నిర్మిస్తున్నామన్నారు. పారిశుధ్య పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ ఉపసర్పంచ్ చంద్రశేఖరాచారీ, కౌన్సిలర్లు కర్నె అలివేలువాసు, పసుపుల కృష్ణ, మున్సిపల్ కోఆప్షన్‌సభ్యుడు రుక్మద్దీన్, బీఆర్ఎస్ నాయకులు బొరెల్లి మహేశ్, కుమార్, వార్డు ప్రజలు ఉన్నారు.

## అటవీశాఖ ఉద్యోగుల క్రీడా పోటీలు విజయవంతం



క్రీడలు ఆడుతున్న అటవీ ఉద్యోగులు



బహుమతులు అందజేస్తున్న అధికారులు

అచ్చంపేట, అక్టోబర్ 3 : ప్రపంచ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా అటవీశాఖ ఉద్యోగులకు రెండురోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించగా మంగళవారం ముగిశాయి. అమ్రాబాద్, అచ్చంపేట, నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు డివిజన్ పరిధిలోని ఉద్యోగులకు పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం నందు క్రీడల పోటీలు నిర్వహించారు. ఉదయం 5కే రన్ పోటీలు నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఇతర క్రీడలు నిర్వహించారు. గెలుపొందిన వారికి, జట్లకు పీపీఎఫ్ జైస్వాల్, సీసీఎఫ్ క్షితిజ, డీఎఫ్‌వో రోహిత్‌రెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు.

సఫారియాత్రలో అటవీశాఖ కుటుంబాలు

ప్రపంచ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా పార్క్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీశాఖ ఉద్యోగుల కుటుంబసభ్యులు సఫారీ యాత్రలో పాల్గొన్నారు. అటవీశాఖ సిబ్బంది, 26 కుటుంబాలకు పరహాబాద్ వ్యూ పాయింట్‌ను చూపించారు. అదేవిధంగా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా అపోలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో

అయిజ, అక్టోబర్ 3: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్ట ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. మంగళవారం ఇన్‌ఫ్లో 5,455 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 5,000 క్యూసెక్కులు నమోదైంది. ఎగువ నుంచి వచ్చే వరద ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 455 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు కర్ణాటక ఆర్డీఎస్ డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.7 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకలోని టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 2,160 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9,728 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 54.267 టీఎంసీల నీటినిల్వ ఉంది. 1,633 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికిగానూ ప్రస్తుతం 1,617.37 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## అర్చకులకు అవగాహన సదస్సు

పాలమూరు, అక్టోబర్ 3 : మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళశారం జిల్లా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దూపదీప అర్చకులకు పునఃశ్చరణ తరగతులు, అర్చకుల పూజా కార్యక్రమాల నిర్వహణపై పండితా ఆనందాచార్యులు, అలంపూర్ పురోహితుడు ఆనంద్‌శర్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఆర్ఐలు వెంకటేశ్వరమ్మ, శ్రీదేవి, ధూపదీప అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఉమ్మడి జిల్లా అర్చకులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ పొందేందుకు 13వరకు అవకాశం

గద్వాలటౌన్, అక్టోబర్ 3: ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్‌లో చేరేందుకు అపరాధ రుసుముతో ఈనెల 13వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు డీఈవో మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు బోనఫైడ్, ఆధార్ కార్డు, రెండుఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అవకాశాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.